# తిమ్మరుసు స్వగతం

## (ఏకపాత్రాభినయం)

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

# Timmarusu Swagatam

## **(తిమ్మరుసు స్వగతం)** (A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**


| | | |
|---|---|---|
| డిజిలిటీకరణ పర్య వేక్షణ | : | నండూరి గోవింద రాజు |
| ప్రతులకు | : | 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,<br>రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్<br>హైదరాబాద్ -500084.<br>Cell -9440495887. |
| Web Site | : | can down load digital copies at<br>nanduri.co.in |



సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# తిమ్మరుసు స్వగతం

ఎవరను నేను?? - నన్నిపుడు ఎవ్వరు గుర్తును పట్టలేరుగా!
చివరకు చూడ  నేనొక సజీవ సమాధిని - వింత గాథలన్,
వివర మెరుంగగా  ప్రజకు వేడుక యుండు - వినుండు శ్రద్ధగా,
అవనికి భారమం చెరిగి, ప్రాణము వీడగ లేని - అంధుడన్.

హృదయము రాయి చేసుకొని - ఈ ధరణిన్ గతియించి నట్టి నా
బ్రదుకును విస్మరించగల ప్రజ్ఞ గణించుటకై శ్రమించెదన్;
బ్రదికెద - గ్రుడ్డి పెద్దపులి వాటముగా అటవీ తటమ్ములన్;
బ్రదికెద - నిత్య నూతన పురాణ చరిత్ర సజీవ పాత్రమై.

ప్రాజ్య విజయనగర రాజ్య మంత్రిని నేను;
తిమ్మరుసు పేరు తెలియు ప్రజకు;
మేలు కొలిపి ప్రజల - ఏలు కొంటిని నాడు;
నేడు - గ్రుడ్డి పీన్గు - నిల్చె నిచట.

నాకు ఆజ్ఞ యొసగె - నరసింహ రాయండు ;
తీసి వేయ కృష్ణదేవు కనులు !
పీకి చూపి నాను - మేక కన్నులు రెండు,
నాకు - బెడిసి కొట్టె - మేక ఉసురు.

తిమ్మరుసువే, నిజము తెలివి తేట లటంచు;
వినుతి చేసినారు - విజ్ఞు లెల్ల;
కలిసి రాని యపుడు - కాలమ్ము - బ్రదుకులో,
మనిషి తెలివి సుంత పనికి రాదు.

మన్ను మిన్ను - నేను - మంత్రినై యుండగా
కన్ను లుండి గూడ - కాంచ లేదు.
పోయె రెండు కనులు - భూకాంత నాజ్ఞచే,
నాడు - నేడు - గ్రుడ్డివాడ నేను.

చిన్న నాడు - నన్ను చేరి నాశిరముపై
పడగ విప్పి, త్రాచు పాము - ఆడె,
కానబడని యట్టి - కాల సర్పము - నేడు,
నన్ను కాటు వేసె - కనుల మీద

మంద మంద దీర్ఘ మరణ యాతన గదా !
నయనములను విడిచి - నరుడు బ్రదుక,
జీవితమ్ము చిరము - చిమ్మ చీకటి పాలు;
అరయ - మేలు - శీఘ్ర మరణ శిక్ష.

నీ కందోయికి రక్ష గూర్చితిని , నిన్ సింహాసనంబందు ప్రే
మైకాగ్రత నిల్పి నాను - జన కళ్యాణోత్సవాపేక్షతో;
నా కందోయిని పీకినావు - వికట న్యాయాను సంధాతవై;
లోకుల్ నాటక సన్నివేశ గతి ఆలోచింప వచ్చున్ సదా.

మెప్పుల్ గొప్పగ నీకు కూర్చితిని - నీ మేల్ గోరి ధీయుక్తి నీ
తప్పుల్ దిద్దితి - కృష్ణరాయ వసుధాధ్యక్షా ! సభా వేదిపై;
అప్పాజీ యని సత్కరించితివి ఆహ్వానించి - ఏర్ దాటి ఆ
తెప్పన్ కాల్చెడి రాజనీతి చతురా ! ధీశాలి వీవే గదా!

" గుత్తిన్ పుల్లెలు కుట్టి - చంద్రగిరిలో కూడెత్తి - పెన్ కొండలో
హత్తిన్ సత్రము నందు వేడి- పలు దుర్గాధీశు తాంబూలపుం
దిత్తుల్ మోసిన " కాలమున్ మరచిపోతిన్ మంత్రినై - నేడు నా
చిత్త క్షోభము ఉప్పెనైనదిట - దిక్ సీమాంతముల్ ముంచుచున్.

ఉద్రేకమ్మున ముందు కేగు టనిన యుద్ధమ్ములో - మంచిదే;
భద్రాసక్తి ప్రశాంత బుద్ధులు సదా పాలించు రాజ్యమ్ము - ని
ర్నిద్రాలోచన నిత్య జాగృత మతిన్ సేవించితిన్ నిన్ను - యా
వద్రాజ్యమ్మును - శాంతి భద్రతలతో వర్ధిల్ల నెల్లప్పుడున్.

ఉండు - దేహమునకు రెండు కనులు గాని;
మెదడు కుండు - వేయి మేటి కనులు !
ఉన్న - రెండు కన్ను లుద్రేకమున పోవ,
మెదడు కనులు రాజ్య మేల గలవు.

ఖడ్గ శక్తి వేరు - కార్య సాధన వేరు;
ఉభయ శక్తు లుండ వొకరి యందె;
కత్తి విరుగ వచ్చు - కదన రంగము నందు,
బ్రదుకు నందు మెదడు పదను పోదు.

అధికారమ్ము సమస్తముల్ నిలువ - కేంద్రాధార బిందూద్ధతిన్,
విధి సూత్రమ్ములు లేక యున్నను వ్యధా వేధల్ ప్రవర్తిల్లవా ?
అధిగమ్యంబులు లేక యున్న - సరళ న్యాయమ్ము చేకూరి - ఇం
క ధరా పాలన సాగునా ? ప్రజలకున్ కళ్యాణ పేయమ్ముగా.

చేటు - రాజ శిశువు సింహాసనము నెక్క;
అయిన నేను రాజహంత గాను;
శిక్ష వేసె నాకు - శ్రీ కృష్ణ రాయండు;
పుత్ర మోహవర్తి - బుద్ధి లేక.

తనకు పైన చేరి పని చేయు దొర తోడ,
ఇచ్చకములు వదిలి - హితవు పలుకు;
అవని మీద - క్రింది అధికారి ఒకడైన,
కలి యుగాన పుట్టు గాక మరల.

వాచ్యము చేయ తప్పదిక - స్వార్ధముతో తన బాల పుత్రకున్;
నైచ్యము మీర పూని నరనాథుని చేసెను తాను మంత్రియై!
శోచ్యము - కృష్ణరాయ దరిసూదను డట్టుల సేయ - నేడు - శ్రీ
అచ్యుత దేవ రాయల జనాధిపు చేయుట రాజ నీతియే.

హితము - ప్రధాని నౌటను వచించితి - రాయల వారు నాకు స్నే
హితు డని నమ్మినాడను - మనీషి వివేకిగ  దేశభక్తితో,
బ్రతుకును తీర్చి దిద్దుకొను వాడని యెంచితి - శీఘ్ర కోపియై
మతి చెడిపోయి నా కనులు మాప విధించెను నాకు శిక్షగన్

ప్రభువు - పట్ట పగలె - రాత్రి యంచును పల్క;
కొలువు వారు - కాదు కూడ దనరు;
"అవిగో- అంబరమ్ము నందు నక్షత్రముల్ !!"
అనుచు కొంత మంది అరవ వచ్చు.

ప్రియము పలుకు వారు - పృథివి కోకొల్లలే !
బొంకె యైన జంకు గొంకు లేక;
పథ్య మప్రియమ్ము పలుకు వారలు లేరు·
వినెడి వారు లేరు ! జనుల యందు.

కత్తి త్రిప్ప గలడు ఘంటమ్ముతో పాటు ,
కాంచ గలడు పగటి కలలు పెక్కు;
చదువ లేదు మనుజ హృదయాలు బ్రదుకులో!
గ్రంథ కీటకమ్ము - రాయ విభుడు.

గజపతి పైన – నెగ్గు నవి - కత్తి కటారుల ? వాజినాథుపై
భుజబల శౌర్య మెట్లు సరిపోవు? యధోచిత రాజనీతిలో
విజయము శక్తి యుక్తులకు వియ్యము గూర్చెడి గొప్ప లౌక్యమే !
ప్రజ లిక కోరుకొందురిట రాజుగ అచ్యుత దేవరాయలన్.

శీఘ్రకోపి గాని శ్రీ కృష్ణరాయండు,
కాడు - తెలివి లేనివాడు గాడు;
పచ్చి శిశువునకును - పట్టాభిషేకమ్ము
కట్టు టనిన - ముదిరి నట్టి పిచ్చి.

రాజు కంటె గూడ - రాజ్యమే ముఖ్యమ్ము;
రాజ్య మనిన నేమి ? ప్రజలే గాక ?
నాడు - నేడు - మీరినాడ - రాజాజ్ఞనే;
ప్రజల కొరకు - రాజ్య రక్ష కొరకు.

ఏను బ్రోచినాడ - కృష్ణరాయల -నాడు;
కీడు  చేసె నతడు - నేడు - నాకు;
బ్రదుకు లోని - వింత వైరుధ్య విక్రాంతి,
అనుభవైక వేద్య మయ్యె నిపుడు .

కనులు పోయె నాకు - కర్మానుబంధమ్ము;
మేక కనులు - నేను - పీకినాను,
మేక అరపు లిపుడు నాకు విన్పించుగా !
మారు మ్రోగి - నాదు మనసు నందు.

అరటి పండు మెక్కి - అలవోక మనుజుండు,
పార వేయు తొక్క - దూరమునకు,
స్వార్థపరుడు ప్రభువు - అధికారి - తెలివిగా
ప్రక్క వారి నటులె వాడు కొనును.

ఆవహమ్ము నందు - అంతఃపురము నందు;
భువన విజయమందు - కవుల గోష్ఠి -
కృష్ణరాయ విభుడు - క్రీడించగా గల్గె;
ఏను - రాచ కార్య మెపుడు తీర్చ.

ధరణి రక్తి కట్టు - పరిపాలనము నందు;
పనులు - తగిన వారు పంచుకొనిన,
ప్రతిభ యుండ దన్ని పనులలో - ఒకరికే,
చూడ  అవసరమ్ము - సూత్రధారి.

విజయనగర మందు - వివిధాంశముల - నేను,
సూత్రధారి నగుచు చూచినాను;
నిష్క్రమించినాడ - నేడింక రాజ్యమ్ము,
దారము  తెగి నట్టి హార మగును.

మింటి నంటు  మేటి మేడ మిద్దెల లోన,
చుట్టు గుడిసె లోన - సుఖము లేదు !
సతత శాంతి సస్య సంపన్నుడె రైతు,
బ్రదుకు నందు  మిన్న - రాజు కంటె.

న్యాయము చూడ లే దెపుడు వ్యక్తికి - తీర్పును చెప్పితిన్ ప్రజా
శ్రేయము కోరి - భోగ కుల వృత్తికి క్రొత్తగ పన్ను వేసి, ఆ
దాయము పెంచిబొక్కసము దండిగ నింపితి - నీతి వీడి - నా
ధ్యేయము రాజు లాభమె మదిన్ - మరి పాపము కాటు వేయదే ?

నాటకీయ గాథ - నన్ను చూచిన చాలు,
ఎల్లరకును తేట తెల్ల మగును;
విశ్వ చరిత లోని - విధి వైపరీత్యమ్ము;
కాంచ వచ్చు రెండు కనుల ముందు.

కనుల తోడ పోయె - ధనము సర్వము గూడ,
పస్తు లుండ వలసి వచ్చె, కాన,
అమ్మితి - తిరుమలను - అన్న ప్రసాదమ్ము;
శంకర మఠమునకు శరము విడిచి.

బ్రదికెద కొంత కాల మిక ప్రాణము తోడ - సజీవ పారమై !
చదువుడు నన్ను జేరి జన సంతత లెల్లరు - కంటి నీరు కా
ర్చదగదు - ఎవ్వ రైనను , పరాత్పరు శక్తిని మార్చలేరుగా !!
పదవి గతించి నంత - ప్రతిభా ప్రభ – తత్ క్షణ మంతరించెడున్.

శ్రీనివాసు దరికి - శేముషీ ప్రభ పోవ,
చిట్ట చివరి కేను చేరినాను;
శాంతి నిడదు కర్మ; జ్ఞాన యోగము - భ్రాంతి!
జీవితమున - భక్తి శిఖర సమము.

❀ ❀ ❀